TELTEL/2015/66279

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :150 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 17-08-2025 | పేజీలు:4 వెల: 2.00

## ఆదిలాబాద్ జిల్లాలో కుండపోతగా కురుస్తున్న వర్షం..

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్నది. జిల్లాలోని పలు జిల్లాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేకుండా వాన పడుతున్నది. దీంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సిరికొండ మండలంలో చికమాగన్ వాగు ఉప్పొంగింది. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నార్నూర్, గాదిగూడ మండలాల్లో లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలలో వర్షపు నీరు చేరి జలమయమయ్యాయి. గాదిగూడ మండలంలోని ఖడ్కి, లోకారికే, అర్జుని, దాబా, మేడిగూడ, చిత్తగూడ, నార్నూర్‌లోని బాబేఝరి ప్రధాన రహదారులపై లో లేవల్ కల్వర్టులపై వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షానికి ఉమ్మడి మండలంలోని జనం ఇండ్లకే పరిమితమయ్యారు. అత్యవసర సమయంలోనే బయటికి రావాలని, సమస్యలుంటే నేరుగా సంబంధిత శాఖ లేదా డయల్ 100కి సమాచారం అందించాలని నార్నూర్ సీఐ పేందూర్ ప్రభాకర్ తెలిపారు. ఉట్నూరు మండలం దంతనపల్లి వద్ద రోడ్డుపై చెట్లు కూలిపడిపోయింది. దీంతో ఉట్నూరు నుంచి జన్నారం వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

## ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిసిన ట్రంప్, పుతిన్ భేటీ..




అలస్కా: ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ కీలక భేటీ అసంపూర్తిగా ముగిసింది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే దిశగా అలస్కా వేదికగా ఇరువురు దేశాధినేతల సమావేశం ఉంటుందని అంతా అనుకున్నప్పటికీ.. ఎలాంటి ఒప్పందం కుదరకుండానే చర్చలు ముగిశాయి. సుమారు 3 గంటలపాటు వీరి సమాచవేశం జరిగింది. భేటీ అనంతరం ఇరువురు నేతలు భేటీ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా.. సమావేశం ఫలప్రదమైందని ట్రంప్ అన్నారు. భేటీలో అనేక అంశాలపై చర్చించామని తెలిపారు. తమ చర్చల్లో ఎంతో పురోగతి లభించిందని, అయితే కొన్ని సమస్యలను ఇంకా పరిష్కరించుకోవాల్సి ఉందని చెప్పారు. తుది ఒప్పందం మాత్రం కుదరలేదని వెల్లడించారు. చాలా అంశాలను ఇద్దరం అంగీకరించామని, అయితే కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయని పేర్కొన్నారు. అన్ని విషయాలను పరిష్కరించుకొని అధికారికంగా ఒప్పందంపై సంతకం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. త్వరలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ, ఈయూ నేతలతో మాట్లాడతానని చెప్పారు. మళ్లీ పుతిన్‌ను కలుస్తానని చెప్పగా, తదుపరి సమావేశం మాస్కోలో ఉంటుందని ప్రకటించారు. అలస్కాలో ట్రంప్‌తో సమావేశం చాలా నిర్మాణాత్మకంగా జరిగిందని వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం ప్రధాన అంశంగా చర్చించామన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించేందుకు తాను నిజాయతీగా ఉన్నానని, ఈ సమావేశం వివాదానికి ముగింపు పలకడానికి పునాది అని వెల్లడించారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. ట్రంప్‌తో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరుదేశాల మధ్య సంబంధాల విషయాలలో క్లిష్టకాలంలో అధ్యక్షుడు ట్రంప్‌తో మాస్కో మంచి సంబంధాలు ఏర్పరచుకున్నదని చెప్పారు. ఉక్రెయిన్‌పై ట్రంప్ , తాను ఒక అవగాహనకు వచ్చామన్నారు. చర్చల పురోగతిని దెబ్బతీయవద్దని ఈయూని హెచ్చరించారు. 2022లో ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే ఉక్రెయిన్‌తో రష్యాకు యుద్ధం వచ్చి ఉండేది కాదని పుతిన్ పునరుద్ఘాటించారు. తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మాస్కోకు రావాల్సిందిగా పుతిన్ ఆహ్వానించారు.

## ఆ 9 జిల్లాలకు భారీ రెయిన్ అలర్ట్.. సీఎం రేవంత్ కీలక ఆదేశాలు!

హైదరాబాద్,తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు.తెలంగాణలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. శనివారం ఉదయం భారీ వర్షాలపై ఉన్నతాధకారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, జయశంకర్, భూపాలపల్లి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన విషయం తెలిసిందే. 15 జిల్లాల్లో అధిక వర్షాపాత, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షం నమోదైందని సీఎం తెలిపారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో SDRF, NDRF బృందాలను ముందుగానే మోహరించాలని సీఎం ఆదేశించారు. ఆయా బృందాలు కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను ముందుగానే సహాయక శిబిరాలకు తరలించాలని సూచించారు.రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నీటి పారుదలశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించారు. నీటి మట్టాన్ని అంచనా వేస్తూ తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. నీటిని కిందకు విడుదల చేయాల్సి వస్తే ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాటు ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇసుక బస్తాలను ముందుగానే ఆయా ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై వరద నీరు ఉంటే



ముందుగానే గమనించి రాకపోకలు నిలిపివేయాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆయా రోడ్లపై ముందుగానే బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందన్నారు. నగర, పురపాలక, గ్రామ పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ తగినంత మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్ నగరంలో అధికారులు ఇంకా అలర్ట్‌గా ఉండాలన్నారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రజల నుంచి వచ్చే వినతుల సత్వర పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

## రాహుల్ దూకుడు కళ్లెం.. బీజేపీ హైలెవిల్ స్ట్రాటజీ!

న్యూఢిల్లీ,ఓట్ల చోరీ నినాదంతో దేశవ్యాప్త ఉద్యమానికి తెరదీసిన కాంగ్రెస్ పార్ట అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దూకుడుకు కళ్లెం వేసేలా.. బీజేపీ హైలెవిల్ స్ట్రాటజీని రెడీ చేస్తున్నట్టు జాతీయ మీడియా వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్ర ఎన్నికల సంఘం వర్సెస్ రాహుల్ గాంధీల మధ్య వివాదం కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘానికి కొంత ఎదురు దెబ్బ తగిలింది. బీహార్‌లో అనర్హులుగా పేర్కొన్న 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ప్రజలకు ఇవ్వాలని.. వారి వివరాలు చెప్పాలని ఆదేశించింది. ఈ పరిణామాన్ని.. తాను చేస్తున్న యుద్ధంలో తొలి విజయంగా రాహుల్‌గాంధీ భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన పక్కా ప్రణాళిక ప్రకారం మరింత దూకుడు ప్రదర్శించాలని నిర్ణయించారు. మరోవైపు.. రాహుల్ రోజు రోజుకు చేస్తున్న విమర్శలు, ఆయన ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కు ప్రజల్లోనూ స్పందన బాగానే ఉంది. మరోవైపు.. ఆన్‌లైన్‌లోనూ.. దేశవ్యాప్తంగా 50 కోట్ల మందిని ఈ ఉద్యమం దిశగా ముందుకు నడిపించేందుకు రాహుల్ గాంధీ ప్రత్యేక స్ట్రాటజీని అమలు చేస్తున్నారు.ఓట్ చోర్ పేరుతో రూపొందించిన యాప్‌లో ప్రజలను చేరుస్తున్నారు. దీనిని సుప్రీంకోర్టుకు సమర్పించ డం ద్వారా ప్రజలు కూడా ఎన్నికల సంఘంపై అనుమానాలు ఉన్నాయని చెబుతున్నారని, దీనిపై చర్య లు తీసుకోవాలని రాహుల్ కోరే అవకాశంఉంది. అంటే.. మోడీ ఇజ్జత్‌కు ఇది ప్రధాన సవాలుగా మారనుందన్నది బీజేపీ వర్గాలు చెబుతున్న మాట. అక్రమంగా గెలిచి అధికారంలోకి వచ్చారన్న రాహుల్ వాదనకు బలం చేకూరితే.. ఇప్పటి వరకు పడిన ప్రయాస,



చేసిన మంచి అంతా పోయినట్టేనని కమల నాథులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయిలో నాయకులు శుక్రవారం రాత్రి భేటీ నిర్వహించినట్టు సమాచారం. దీనిపై జాతీయ మీడియాలోనూ కథనాలు వస్తున్నాయి. పార్లమెంటు సమావేశాలు ముగిసేలోగానే.. దీనికి బలమై న వ్యూహంతో చెక్ పెట్టేలా వ్యూహాలు రెడీ చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ప్రజల్లోకి తాము కూడా వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఓట్ల చోరీ జరిగి ఉంటే.. రాహుల్ ఎలా విజయందక్కించుకు న్నారు?, తెలంగాణ, కర్ణాటకల్లో ఎలా అధికారంలోకి వచ్చారు? అనే విషయాలను బలంగా ప్రజల మధ్య చర్చకు పెట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. మొత్తానికి హైలెవిల్ స్ట్రాటజీ అయితే.. చేపట్టనున్నట్టు జాతీయ మీడియా వర్గాల్లో చర్చ సాగుతోంది.

## హై అలర్ట్.. వంట మనిషి వేషంలో ఉగ్రవాది? ఎలా గుర్తించారంటే..




ధర్మవరం:ఏపీలో ఉగ్రవాదుల కదలికలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. కౌంటర్ ఇంటెలిజెన్స్, ఎన్ఐఏ పోలీసుల అప్రమత్తత వల్ల ఉగ్రవాదుల జాడ ముందే గుర్తించడం పెను ముప్పు తప్పినట్లు చెబుతున్నారు. నాలుగు నెలల క్రితం మే నెలలో విజయనగరం పట్టణానికి చెందిన ఓ యువకుడికి ఉగ్ర లింకులు ఉన్నట్లు బయటపెట్టిన పోలీసులు.. తాజాగా సత్యసాయి జిల్లా ధర్మవరంలో మరో యువకుడికి ఉగ్ర లింకులు ఉన్నట్లు గుర్తించారు. ధర్మవరం పట్టణంలో ఓ చిన్న హోటల్ లో వంటమనిషిగా పనిచేస్తున్న యువకుడు కదలికలు గత కొన్ని నెలలుగా అనుమానాస్పదంగా ఉండటం, సోషల్ మీడియా ద్వారా ఉగ్ర లింకులు ఏర్పరచుకున్నట్లు నిర్ధారణ కావడంతో ఆకస్మికంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనతో గతంలో హైదరాబాదులో తలదాచుకున్న ఉగ్రవాదులు ఇప్పుడు తమ మకాం రాయలసీమకు మార్చారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రాయలసీమలోని సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని కోట కాలనీలో నివాసం ఉంటున్న నూర్ అనే వ్యక్తిని ఎన్ఐఏ పోలీసులు రెండురోజుల క్రితం అదుపులోకి తీసుకున్నారని ఆలస్యంగా తెలిసింది. స్థానికంగా ఓ హోటల్లో వంట మనిషిగా పనిచేస్తున్న నూర్ కదలికలపై కొన్ని రోజులుగా ఎన్ఐఏ పోలీసులు నిఘా వేసినట్లు చెబుతున్నారు. అతడి అనుమానాస్పద తీరుతో సోషల్ మీడియా ఖాతాలపై నిఘా వేసినట్లు సమాచారం. ఎన్ఐఏ అధికారుల పరిశీలనలో అతడు దేశం అవతల శక్తులతో సంభాషిస్తున్నట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. దీంతో రెండు రోజుల క్రితం ఆకస్మికంగా నూర్ ఇంటిపై దాడి చేయగా, అతడి ఇంట్లో ఏకంగా 16 సిమ్ కార్డులు బయటపడ్డాయని అంటున్నారు. సామాన్య వంట మనిషికి 16 సిమ్ కార్డులు ఉండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘ వ్యతిరేక కార్యకలాపాల వల్లే అతడు అన్ని సిమ్ కార్డులు ఉంచుకున్నాడా? అనే దిశగా ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోందని చెబుతున్నారు.ఈ ఘటనతో ధర్మవరంతోపాటు రాయలసీమ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్రాన్ని ఉగ్రవాదులు షెల్టర్ జోన్ గా మార్చుకుంటున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత నాలుగు నెలల్లో ఇది మూడో అరెస్టు కావడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల అప్రమత్తత వల్ల ఉగ్రవాదుల ముప్పు తప్పినా, ప్రజల మధ్యే రకరకాల వేషాల్లో ఉగ్రవాదులు తిరుగుతుండటమే భయాందోళనకు కారణమవుతోందని అంటున్నారు. రాష్ట్రంలో తొలుత మే 17న విజయనగరం పట్టణానికి చెందిన సిరాజ్–ఉర్–రెహ్మాన్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉగ్రవాద భావజాలం ఉన్న సిరాజ్ హైదరాబాద్ కు చెందిన సమీర్ సయ్యర్ తో కలిసి రాష్ట్రంలో బాంబు పేలుళ్లకు ప్రయత్నించినట్లు పోలీసులు చెప్పారు.సోషల్ మీడియా ద్వారా విదేశాల్లో ఉన్న ఉగ్రవాదులతో సిరాజ్, సమీర్ సంభాషించడాన్ని గుర్తించిన తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు పక్కా వ్యూహంతో ఆ ఇద్దరిని అరెస్టు చేశారు. అప్పటికే బాంబు పేలుళ్లపై ఆ ఇద్దరు కొన్ని ట్రయల్స్ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. కొద్ది రోజుల్లో తమ ప్లాన్ అమలు చేయాలని ఆ ఇద్దరు ప్రయత్నిస్తున్న దశలో పోలీసులు కుట్రను ఛేదించారు. దీంతో హమ్మయ్య అని అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక అక్కడికి నెల రోజుల వ్యవధిలోనే రాయలసీమలోని అన్నమయ్య జిల్లాలో మరో ఉగ్ర లింకు బయటపడింది. ఈ సారి దేశంలో పలు నగరాల్లో బాంబు పేలుళ్లకు కారణమైన ఇద్దరు ఉగ్రవాదులు చాలా కాలం నుంచి మారు వేషంలో రాయచోటిలో తలదాచుకున్నట్లు పోలీసులు గుర్తించారు.తమిళనాడులో నిషేధించబడిన "అల్ ఉమ్మా" అనే ఉగ్రవాద సంస్థకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు దాదాపు 20 ఏళ్లుగా రాయచోటిలో మారు వేషంలో ఉంటున్నారని గత నెలలో పోలీసులు గుర్తించారు. పక్కా ప్లానింగుతో ఆ ఇద్దరిని పట్టుకున్నారు. దర్యాప్తులో వారిద్దరూ నిషేధిత సంస్థకు చెందిన ఉగ్రవాదులు అబూబకర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీగా తేలింది. వారి నివాసాల నుంచి పోలీసులు సూట్‌కేస్ బాంబులు, బకెట్ బాంబులతో పాటు పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, వాకీటాకీలు వంటివి స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఆక్టోపస్ బృందం రాయచోటి డీఎస్పీ కార్యాలయం సమీపంలో నిర్వీర్యం చేసింది. చీరల వ్యాపారం పేరుతో రాయచోటి చుట్టు పక్కల ప్రాంతాల్లో తిరిగే ఈ ఇద్దరు భారీ పేలుళ్లకు ప్లాన్ చేయడంతో ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. అంతేకాకుండా 1995–2013 మధ్య కాలంలో తమిళనాడు, కేరళ, కోయంబత్తూరు, తిరుచ్చి, చెన్నైతో సహా పలు ప్రాంతాల్లో జరిగిన బాంబు పేలుళ్లు, రాజకీయ హత్యలు, కుట్రలకు వీరికి సంబంధం ఉందనే అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 1999లో నాగూర్ పార్శిల్ బాంబు పేలుడులో, 2011లో మధురైలో ఎల్.కె.అద్వానీ రథయాత్ర సమయంలో పైప్ బాంబు కుట్ర, 2013లో బెంగళూరులో జరిగిన బాంబు పేలుళ్లకు వీరికి సంబంధం ఉందని పోలీసులు చెబుతున్నారు. స్థానిక మహిళలను వివాహం చేసుకుని, తమ ఉగ్ర కార్యకలాపాలను ఎవరికీ అనుమానం కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో ధర్మవరంలో మరో ఉగ్ర లింకు బయటపడటం ఆందోళన రేకెత్తిస్తోంది. వరుసగా బయటపడుతున్న లింకులతో రాష్ట్రానికి చెందిన యువత బయట శక్తుల పట్ల ఎందుకు ఆకర్షణకు గురవతోందనే చర్చ జరుగుతోంది.

## వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలిస్తాం.. నితీష్ కుమార్ ప్రకటన



పాట్నా:త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి ఎన్డీఏ కూటమి–ఇండియా కూటమి మధ్య హోరాహోరీ ఫైటింగ్ సాగేలా ఉంది. మరోసారి అధికారం కోసం ఎన్డీఏ కూటమి ప్రయత్నిస్తుంటే ఈసారి ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఇండియా కూటమి భావిస్తోంది.ఇలా ఇరు పక్షాలు ప్రణాళికలు రచిస్తున్నాయి.తాజాగా ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎక్స్ ట్విట్టర్‌లో కీలక ప్రకటన చేశారు. వచ్చే ఐదేళ్ల నాటికి యువతకు కోటి ఉద్యోగాలను అందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కూడా ప్రకటించారు. రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించే వ్యవస్థాపకులకు సహాయపడతామని తెలిపారు. పరిశ్రమలను ప్రోత్సహించేం దుకు, యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ అందించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా నితీష్ కుమార్ పేర్కొన్నారు.2020లో తమ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి కల్పించే లక్ష్యాన్ని నెరవేర్చిందని తెలిపారు. ఇప్పుడు రాబోయే 5 సంవత్సరాల్లో కోటి మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని.. అలాగే ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలు స్థాపించేవారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు అన్ని జిల్లాల్లో భూమిని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువ ఉపాధి కల్పించే పరిశ్రమలకు ఉచితంగా భూమిని అందచేయనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రపతికి కోర్టు గడువు విధించవచ్చా..?

న్యూఢిల్లీ,చట్టసభల్లో ఆమోదింపబడిన బిల్లులు గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలని సుప్రీంకోర్టు గతంలో ధర్మాసనం ఆదేశించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 10 బిల్లులను రాష్ట్ర గవర్నరు ఆర్.ఎన్.రవి ఆమోదించకుండా తన దగ్గరే ఉంచుకోవడం సరికాదని ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించడంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. అనంతరం దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గడువు విధింపుపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది.తాజాగా కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానానికి క్లారిటీ ఇచ్చింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. రాష్ట్రపతి, గవర్నర్‌ల ఆమోదానికి గడువు విధించే అధికారం కోర్టుకు ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కొన్ని విషయాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే రాజ్యాంగపరంగా గందరగోళం తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లులపై గవర్నర్లు



అంగీకారం తెలిపే విషయంలో కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ.. గడువు విధించడం వల్ల రాష్ట్రపతి, గవర్నర్ల అత్యున్నత స్థానాన్ని తగ్గించినట్లు అవుతుందని కేంద్రం తెలిపింది. విధుల్లో ఏవైనా లోపాలు ఉంటే అనవసరమైన న్యాయ జోక్యాల ద్వారా కాకుండా రాజ్యాంగపరమైన యంత్రాంగాల ద్వారా సరిదిద్దాలని సూచించింది.

## అమెరికా బయల్దేరిన ఎమ్మెల్సీ కవిత..

హైదరాబాద్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు పయనం అయ్యారు. శనివారం ఉదయం పెద్ద కుమారుడు ఆదిత్య, చిన్న కుమారుడు ఆర్యతో కలిసి అమెరికాకు బయల్దేరారు.శంషాబాద్ ఎయిర్ పోర్టులో కవిత భర్త అనిల్, కుటుంబ సభ్యులు, తెలంగాణ జాగృతి నాయకులు సెండాఫ్ ఇచ్చారు. చిన్న కుమారుడు ఆర్యను కాలేజీలో చేర్పించేందుకు కవిత అమెరికా వెళుతున్నారు. 15 రోజుల పాటు అమెరికా పర్యటనలో ఉండనున్నారు. ఎమ్మెల్సీ కవిత సెప్టెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.అమెరికా పర్యటన నేపథ్యంలో తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ కవిత ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌కు శుక్రవారం వెళ్లారు. చిన్న మనువడు ఆర్యను కేసీఆర్ ఆశీర్వదించారు. ఇక కవిత అమెరికా పర్యటనకు ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ఇప్పటికే అనుమతించిన విషయం తెలిసిందే. అమెరికాకు వెళ్లేందుకు అనుమతి కావాలంటూ.. రౌస్ అవెన్యూ కోర్టును కవిత ఆశ్రయించారు. కోర్టు ఆమె పాస్‌పోర్టును రిలీజ్ చేసింది. ఢిల్లీ మద్యం



కుంభకోణం కేసులో కవితను 2024 మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఐదు నెలల జైలు శిక్ష అనంతరం షరతుల మీద బెయిల్ మంజూరైంది. ఆ సమయంలో కవిత తన పాస్‌పోర్టును రౌస్ అవెన్యూ కోర్టులో సమర్పించారు.

# డిజిపి జితేందర్‌కు మాతృ వియోగం

హైదరాబాద్, రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు మాతృవియోగం కలిగింది. జితేందర్ తల్లి కృష్ణ గోయల్(85) శుక్రవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కృష్ణ గోయల్.. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శనివారం ఉదయం మహాప్రస్థానంలో డీజీపీ తల్లి అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కృష్ణ గోయల్ మృతిపట్ల సిఎం రేవంత్ రెడ్డి, పలువురు రాజకీయ నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సంతాపం ప్రకటించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ మాతృమూర్తి మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగాఢ సంతాపం తెలిపారు. జితేందర్ కుటు-ంబానికి ఇది తీరని లోటు- అని పేర్కొన్నారు. వారి మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబసభ్యులకు దేవుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు.

# కన్నకొడుకును చంపిన తల్లి

మెదక్, మెదక్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది.. వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని 25 ఏళ్ళ కన్న కొడుకుని తల్లి చంపేసింది. హత్యకు ప్రియుడు సైతం సహకరించారు. 9 నెలల తర్వాత అహ్మద్ పాషా (25) హత్య కేసును పోలీసులు ఛేదించారు. తూప్రాన్ (మం) వెంకటాయపల్లిలో ఘటన చోటు చేసుకుంది. యువకుడి మృతిపై ఎలాంటి ఫిర్యాదు రాకపోవడంతో 9 నెలలుగా విషయం బయటపడలేదు. పోలీసులు వివిధ చోట్ల మృతుడి పోస్టర్లు అంటించడంతో ఓ వ్యక్తి గుర్తుపట్టి పోలీసులకు వివరాలు అందించారు. ఆ వ్యక్తి వివరాల ఆధారంగా తల్లిని విచారించగా బాగోతం బయటపడింది. పోలీసుల కథనం ప్రకారం.. గతేడాది నవంబర్ 23న తూప్రాన్ పరిధిలోని హల్దీ వాగులో ఓ వక్తి శవం బయటపడింది. ఎవరో మర్డర్ చేసినట్లు- అనుమానం వ్యక్తం చేశారు. దీంతో కేసు నమోదు చేసి ఆ వ్యక్తి వివరాలు తెలుసుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మృతుడికి సంబంధించిన ఫొటోలు వైరల్ చేశారు. పోలీసులకు కొన్ని సాంకేతిక ఆధారాలు దొరికాయి. వెంకటాయపల్లికి చెందిన 25 ఏళ్ల అహ్మద్ పాషాగా గుర్తించారు. ఎవరు చంపారు అనే కోణంగా దర్యాప్తు చేశారు. దీంతో షాకింగ్ విషయం బయటకు వచ్చింది. అహ్మద్ తల్లి రెహనా(48) చంపినట్లు తేలింది. ఆమె భర్త చిన్నప్పుడే చనిపోవడంతో.. భిక్షపతి(55) అనే వ్యక్తితో 15 ఏళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగించింది. ఈ విషయంలో తల్లి కొడుకుల మధ్య తరచూ గొడవలు చోటు- చేసుకునేవి. దీంతో ఆ తల్లి కొడుకు గొంతును తాడుతో బిగించి చంపేసింది. ప్రియుడితో కలిసి ఆ మృతదేహాన్ని వాగులో పారేసింది.

# అభివృద్ధిలో దూసుకుపోతున్న విజయనగరం

విజయనగరం, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మంత్రి శ్రీనివాస్ తమ స్వాతంత్య్ర దినోత్సవ సందేశంలో పేర్కొన్నారు. జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను, సాధించిన ప్రగతిని వివరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను, తద్వారా ఒనగూరే ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ రోజు నుంచే స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు 74 శాతం పూర్తి అయ్యాయని చెప్పారు. విజయనగరంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ కు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్, జెసి ఎస్. సేతు మాధవన్ స్వాగతం పలికారు. మంత్రి శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ పెరేడ్‌ను పరిశీలించారు. శాంతి కపోతాలను ఎగురవేశారు. సాయుధ దళాలనుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా ప్రజలకు తమ స్వాతంత్య్ర దినోత్సవ సందేశాన్ని వినిపించారు. పోలీసుల కవాతును, డాగ్‌షో ను తిలకించారు. వేడుకలకు హాజరైన ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు, విజయనగరం ఎంఎల్ఏ పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి తదితర ప్రముఖులను పరిచయం చేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనలను, అగ్నిమాపక శాఖ విన్యాసాలను తిలకించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలను అందిస్తున్న జిల్లా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రభుత్వ శాఖలు ఏర్పాటు- చేసిన స్టాల్స్‌ను సందర్శించి, ఉపకరణాలను పంపిణీ చేశారు. అన్న క్యాంటీ-న్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నామన్నారు. ప్రతి ఇంటికీ ఒక ఎంటర్‌ప్రెన్యువర్ రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు- చేసి, పెద్ద ఎత్తున పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా మన సాయుధ దళాల సత్తాను నిరూపించామని పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాన్ని, మన జిల్లా ప్రముఖుల ఖ్యాతిని ఈ సందర్భంగా కొనియాడారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతమూ అలరించాయి. ముందుగా ప్రదర్శించిన పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టు-కున్నాయి. విజయనగరం కెజిబివి, జామి కెజిబివి, ఫోర్ట్ సిటీ- స్కూల్, చీపురుపల్లి బాలసదన్, వియ్యంపేట డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కొత్తవలస జెడ్‌పి పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. జామి కెజిబివికి మొదటి బహుమతి, బాల భవన్‌కు ద్వితీయ బహుమతి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులానికి తృతీయ బహుమతులు లభించాయి. ప్రభుత్వ కార్యక్రమాలను, ప్రగతిని వివరిస్తూ శకటాల ప్రదర్శన జరిగింది. వ్యవసాయ శాఖ, సెర్ప్-గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ-సమగ్ర శిక్ష, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వైద్యారోగ్యశాఖ, గృహనిర్మాణశాఖ, విజయనగరం మున్సిపాలిటీ-, పరిశ్రమలశాఖ, ముఖ్య ప్రణాళికా శాఖ, స్త్రీ శిశు సంక్షేమం, గ్రామీణ నీటి సరఫరా మొదలగు ప్రభుత్వ శాఖలు తమ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ శకటాలను ప్రదర్శించి ఆకట్టు-కున్నాయి.

# విలేజ్ సర్వేయర్‌కు ఉత్తమ సేవా అవార్డు

అనంతపురం, పుట్లూరు మండల పరిధిలోని మడ్డిపల్లి సచివాలయంలో విలేజ్ సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న ఆనంద ప్రసాద్ కు ఉత్తమ సేవ అవార్డు లభించింది. స్వతంత్ర దినోత్సవ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ, జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ చేతుల మీదుగా అనంతపురంలో ఆనంద్ ప్రసాద్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. మండలంలోని మిగతా విలేజ్ సర్వేర్లు ఆనంద ప్రసాద్ ను అభినందించారు.

# గిద్దలూరు వైసీపీలో అయోమయం.. నాగార్జున ఫ్యూచర్ ఏంటి?

విజయవాడ::గిద్దలూరు వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబుతో పాటు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందూరు నాగార్జున రెడ్డిలకి సొంత పార్టీలోనే గడ్డు పరిస్థితి ఏర్పడిందట. గత ఎన్నికల్లో గిద్దలూరు నుంచి పోటీ చేసి ఓడిపోయిన నాగార్జునరెడ్డి తిరిగి తనకు పట్టున్న మార్కాపురం వెళ్తానంటే జగన్ ఒప్పుకోవడం లేదంట. ఆయన చెప్పిన నియోజకవర్గానికి వెళ్లడానికి ఈయన ఇష్టపడటం లేదంట. అలాఅని తన మనసులోని మాటను అధిష్టానానికి గట్టిగా చెప్పలేక వారు చెప్పింది వినలేక మల్ల గుల్లాలు పడుతున్నారట. రెండువైపుల పట్టున్న రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన తన రాజకీయ భవిష్యత్తు అంధకారం కాబోతుందని ఆందోళన చెందుతున్నారంట. ఇంతకీ కుందులకు వచ్చి ఇబ్బంది ఏంటి? ఆ పరిస్థితి ఎందుకు తలెత్తింది?



**2019లో గిద్దలూరు సెగ్మెంట్ కైవసం చేసుకున్న వైసీపీ**

ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం వైసీపీకి పట్టు ఉన్న నియోజకవర్గం. కాంగ్రెస్ తర్వాత వైసీపీ అక్కడ సత్తా చాటుకుంటూ వచ్చింది. 2019 ఎన్నికల్లో వైసీపీకి వచ్చిన మెజార్టీని చూస్తే ఆ పార్టీ ఎంత బలంగా ఉండేదో అర్థమవుతుంది. పులివెందులలో మాజీ ముఖ్యమంత్రి జగన్ తర్వాత గిద్దలూరులో అన్నా రాంబాబు రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజార్టీ సాధించిన నేతగా రికార్డులకు ఎక్కారు. కానీ 2024 ఎన్నికలలో సీను రివర్స్ అయింది. అభ్యర్థుల మార్పులు చేర్పులు ఫలితాలను తలకిందులు చేశాయి.

**జగన్ తర్వాత అత్యధిక మెజార్టీ సాధించిన అన్నా రాంబాబు**

2009 ఎన్నికలలో ప్రజారాజ్యం పార్టీ నుంచి విజయం సాధించిన అన్నా రాంబాబు 2014 ఎన్నికలలో టిడిపి నుండి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికలలో వైసిపి నుంచి బరిలో దిగి జగన్ తర్వాత 81,000 కి పైగా అత్యధిక మెజారిటీ తో విజయం సాధించారు. అయితే 2024 ఎన్నికలలో అన్నా రాంబాబును మార్కాపురం నియోజకవర్గానికి పంపిన వైసీపీ అధ్యక్షుడు జగన్ మార్కాపురంలో ఎమ్మెల్యేగా ఉన్న కుందూరు నాగార్జున రెడ్డిని గిద్దలూరు నుంచి పోటీలో నిలిపారు.. అయితే వైసీపీకి పటున్న ఆ నియోజకవర్గంలో పోటీ చేసిన నేత కొత్త కావడంతో ఓటమి పాలైంది.

**గిద్దలూరుకు మార్చడంతో కుందుల భవితవ్యంపై నీలి నీడలు**

తండ్రి కెపి కొండారెడ్డి, మామ ఉడుముల శ్రీనివాసరెడ్డిల రాజకీయ వారసుడిగారాజకీయాల్లోకి వచ్చిన కుందూరు నాగార్జున రెడ్డి తొలిసారి పోటీ చేసిన 2019 ఎన్నికలలో ధీటైన అభ్యర్థిపై విజయం సాధించి తన ఆగమనాన్ని ఘనంగా చాటారు. అయితే 2024 ఎన్నికలు వచ్చే సమయానికి కుటుంబపరంగా రెండు వైపులా పట్టున్న మార్కాపురం నియోజకవర్గాన్ని కాదని ఆయన్ని గిద్దలూరు నియోజకవర్గానికి పంపడంతో అతని రాజకీయ భవిష్యత్తుపై నీలి నీడలు అలుముకున్నాయి. మార్కాపురంలో తన రాజకీయ వారసత్వం పరంగా మంచి పట్టు కలిగినప్పటికీ స్థానాన్ని మార్చడంతో తన విజయం దూరమైందనే ఆవేదన వ్యక్తమవుతోందంట ఇష్టం లేని పని కష్టంగా మారిందంటున్న నాగార్జునరెడ్డి వర్గంతనకు పట్టులేని గిద్దలూరుకు మార్చడంతో ఆయన పరిస్థితి అయోమయంగా మారిందట.. ఇష్టం లేని పనిచేయడం ఎంత కష్టమో నాగార్జున రెడ్డి పరిస్థితి కూడా అలాగే తయారైందంట. కనీసం మండలాల వారీగా ముఖ్య నాయకులను కూడా కలవడం, లేదా వారు కలిస్తే కలివిడిగా మాట్లాడటం కూడా కష్టంగానే ఉందట%ొ% కనీసం క్యాడర్ అవసరమైనప్పుడు ఫోన్ చేస్తే ఆయన ఫోను లిఫ్ట్ చేయలేని పరిస్థితిలో ఉన్నారనే ప్రచారం జోరు అందుకుంటోంది. తనకు పట్టులేని చోట కష్టపడే కంటే పట్టున్నచోట పాటుపడడమే మేలని ఆలోచనలో నాగార్జున రెడ్డి ఉన్నారట.. ఇప్పటికైనా అధినేత ఆలోచించి తనకు మార్కాపురం కేటాయిస్తే విజయాన్ని అధ్యక్షుడికి కానుకగా ఇస్తానని తన సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారంట. కానీ ఆ విషయాన్ని జగన్‌కు చెప్పే ధైర్యం మాత్రం ఎవరికీ చాలటం లేదట%ొ% ఇదంతా ఒక ఎత్తు అయితే ఆ గిద్దలూరు నియోజకవర్గం కూడా అతనికి దక్కదనే ప్రచారం జరుగుతుండటం గమనించాల్సిన విషయం

**గిద్దలూరు పేరు చెప్తే గుర్తుకు వచ్చే పిడతల కుటుంబం**

గిద్దలూరు నియోజకవర్గం పేరు చెప్పగానే రాజకీయ నేతలకు గుర్తొచ్చే పేరు పిడతల రంగారెడ్డి ఆయన వారసులు. మూడుసార్లు మంత్రిగా పనిచేసిన పిడతల రంగారెడ్డి తరువాత ఆయన కుటుంబ సభ్యులు కూడా అదే స్థాయిలో రాజకీయాలలో నిలదొక్కుకున్నారు. పిడతల కుటుంబం.. గిద్దలూరు నియోజకవర్గంలో బలమైన రాజకీయ కుటుంబం. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుండి 2009 వరకు పిడతల కుటుంబం పోటీలో లేకుండా ఎన్నికలు జరగలేదంటే వారికి స్థానికంగా ఉన్నపలుకుబడి అర్ధమవుతుంది. పార్టీ ఏదైనా పిడతల కుటుంబం పోటీ చేయటం పరిపాటిగా ఉండేది.

**జగన్ సన్నిహితుడైన పిడతల ప్రవీణ్‌కుమార్ రెడ్డి**

గిద్దలూరు నియోజకవర్గంలో అత్యధిక సార్లు విజయం సాధించి, మంత్రిగా చేసిన ఘనత కూడా ఆ కుటుంబానికే దక్కింది.. అయితే 2009 తర్వాత వారి రాజకీయ ప్రభ మసకబారింది.. నేరుగా పోటీలో నిలబడే నేతలు లేక కొంత వెనకంజ వేశారు. అయితే నేడు మాత్రం వైసీపీలో ఆ కుటుంబం నుంచి వచ్చిన, జగన్ సన్నిహితుడైన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి నియోజకవర్గంలో కొత్త రాజకీయానికి తెర తీశారంట. వైసీపీ నేతలను కలుపుకుపోవటంలోనూ, స్వయంగా వెళ్లి కలవడంలోనూ తనదైన చాతుర్యాన్ని వాడుతూ నలుగురిలో గుర్తింపును తెచ్చుకుంటున్నారట.. నియోజకవర్గంలో తన పట్టు చాటుకోవటానికి ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారట.. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు ఎటువంటి ఇబ్బంది వచ్చిన నేనున్నానంటూ ముందుకు సాగుతూ కేడర్ కు అందుబాటులో ఉంటున్నారంటున్నారు.

**మొక్కుబడిగా గిద్దలూరు కార్యకర్తలను కలుస్తున్న నాగార్జునరెడ్డి**

దీంతో ఒక వరలో రెండు కత్తులు ఇవ్వడవు అన్నట్లు అటు ఇష్టం లేని నాగార్జున రెడ్డి.. ఇటు పాత వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని కలుపుకుపోతున్న ప్రవీణ్ కుమార్ రెడ్డిల మధ్య కోల్డ్ వార్ స్టార్ట్ అయిందట.. దీంతో రానున్న రోజుల్లో గిద్దలూరు నియోజకవర్గం ఎవరి చేతుల్లో ఉండబోతుందని వైసీపీ శ్రేణులు ఇప్పటి నుంచే తెగ చర్చించుకుంటున్నాయి. వైసీపీ ఇన్చార్జిగా కొనసాగుతున్న నాగార్జున రెడ్డి మొక్కుబడిగా కార్యకర్తలతో కలుస్తుండగా, బలమైన రాజకీయ నేపథ్యం ఉన్న పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి అందరికీ తలలో నాలుకగా ముందుకు సాగుతుండటం ఆ పార్టీలో చర్చకు తెరలేపుతుందట..రానున్న ఎన్నికల నాటికి ఎవరు ప్రజాక్షేత్రంలో నిలబడతారు అనే చర్చ ఇప్పటి నుండే ఆ నియోజకవర్గంలో

# భయపెడుతున్నాడా! పార్టీ మారుతాడా! రాజగోపాల్ లెక్కేంటి?




హైదరాబాద్, మంత్రి పదవి దక్కలేదని అసంతృప్తితో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వరుస ట్వీట్‌లతో అధికార కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు రేపుతున్నారు. నిన్న మొన్నటి వరకు కాస్త సైలెంట్ గా ఉన్న రాజగోపాల్ రెడ్డి ఇక తాడో పేడో తేల్చుకునే పనిలో పడ్డట్లు కనిపిస్తున్నారు . మంత్రి పదవి ఇస్తానని నమ్మించి మోసం చేసారని, 20నెలలు ఓపిక తో చూశానని ఇక ఓపిక నశించిందని సీఎం రేవంత్ రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడం కాంగ్రెస్ శ్రేణుల్లో కలకలం రేపుతోంది.

**తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

ఉమ్మడి నల్గొండ జిల్లా మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రస్తుతం తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఆయనకు ఒకటికి రెండు సార్లు మంత్రి పదవి కట్టబెట్టతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు ఏర్పటి ఇరవై నెలలు గడుస్తున్నా ఆ హామీని నెరవేర్చలేదు. తొలి మంత్రివర్గం ఏర్పాటులో రాజగోపాల్‌రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాబినెట్ బెర్త్ దక్కించుకున్నారు. ఏడాది తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలోనూ రాజగోపాల్‌రెడ్డికి స్థానం దక్కలేదు.

**హామీ ఇచ్చే ముందు సోదరులమని తెలియదా అంటున్న రాజగోపాల్**

కోమటిరెడ్డి సోదరులు ఇద్దరికీ మంత్రి పదవులు అనేది జిల్లా, కుల సమీకరణల్లో భాగంగా కుదరటం లేదని కాంగ్రెస్ పెద్దలు కొందరు అభిప్రాయపడుతున్నారు. నల్గొండ జిల్లా నుంచి ఇప్పటికే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు క్యాబినెట్లో కొనసాగుతున్నారు. ఆ క్రమంలో ఒకే జిల్లా నుంచి రెడ్డి సామాజికే చెందిన మూడో నేతకు ఎలా మంత్రి పదవి ఇస్తారన్న పాయింట్ లేవనెత్తుతున్నారు, అయితే పార్టీలో చేర్చుకుని హామీ ఇచ్చేముందు తెలియదా సోదరులమని, అలాగే పార్లమెంట్ ఎన్నికల సమయం లో కూడా ఇంచార్జ బాధ్యతలు అప్పగించి హామీ ఇచ్చినపుడు తెలియదా సోదరులమంటూ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బహిరంగ విమర్శలు చేస్తున్నారు .

**ఖమ్మం జిల్లాలో 3 మంత్రి ఇవ్వలేదా అని వాదన**

తొమ్మిది మంది ఎమ్మెల్యేలున్న ఖమ్మం జిల్లాకు మూడు మంత్రి పదవులు ఇచ్చినప్పుడు, 11 మంది ఎమ్మెల్యేలున్న నల్గొండ జిల్లాకు మూడో మంత్రి పదవి ఇస్తే తప్పేంటని రాజగోపాల్‌రెడ్డి లాజిక్ లేవనెత్తుతున్నారు. ఖమ్మంకు ఒప్పు, నల్గొండకు తప్పా అని అటు అధిష్టానాన్ని, ఇటు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. అలా అవకాశం దొరికినపుడల్లా తనకు మంత్రి పదవి దక్కలేదన్న అక్కసు వెల్లగక్కుతూనే ఉన్నారు. ఆయన స్థానిక ఎన్నికల ముందు అధికార పార్టీలో ఉంటూ ఇలా విమర్శలు చేయడం, వరుస ట్వీట్ లు పెడుతుండటం కాంగ్రెస్ పార్టీకి మైనస్‌గా మారుతుండటంతో అధిష్టానానికి ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

**సీఎం రేవంత్‌కు అనుకూలంగా మాట్లాడుతున్న వెంకటరెడ్డి**

ఓ వైపు రాజగోపాల్ రెడ్డి ఇలా విరుచుకుపడుతుంటే సోదరుడు వెంకటరెడ్డి మాత్రం సీఎం రేవంత్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడుతూ మళ్లే నువ్వే రేవంతే ముఖ్యమంత్రి అవుతారని అంటున్నారు. సోదరునికి మంత్రి పదవి హామీ విషయం తనకు తెలియదని చెప్పుకొస్తున్నారు. అలా అన్న ఒకలా తమ్ముడు మరొకలా మాట్లాడటం ఎవరికీ అంతుపట్టడం లేదు . ఆ క్రమంలో ఇప్పుడు అందరి దృష్టి రాజగోపాల్‌రెడ్డిపై పడింది. ఆయన ఏం చేయబోతున్నారు అని ఆసక్తి గా గమనిస్తున్నారు . గతం లో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి ప్రభుత్వం పై కొట్లాడుతూ బీజేపీ లో చేరిన రాజగోపాల్ బైపోల్స్‌లో ఓడిపోయారు. అయితే అప్పుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన వెర్షన్ తాను వినిపించారు. తన రాజీనామా తో ప్రభుత్వం దిగి వచ్చిందని, తనను ఓడించడానికి మునుగోడు నియోజకవర్గంలో అప్పటి ప్రభుత్వం వందల కోట్ల అభివృద్ధి చేపట్టిందని ప్రచారం చేసుకున్నారు . కాని ఇపుడు రాజీనామా బాట పడితే ఆయన ఏం చెప్పదల్చుకున్నారు? అధికారం లో ఉండి కూడా మంత్రి పదవి ఇవ్వలేదని రాజీనామా చేసి ప్రజలకు ఎం చెప్తారు? అని ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు. కేవలం భయపెట్టడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా లేక మరేదైనా వ్యూహమా అని ఎవరికి అంతు చిక్కడం లేదు .

**అభివృద్ధి నిధులు ఆపవద్దని రాజగోపాల్ డిమాండ్**

ఆ క్రమంలో రాజగోపాల్‌రెడ్డి మునుగోడు అభివృద్ధిని ఫోకస్ చేస్తూ కొత్త వాయిస్ వినిపిస్తున్నారు. మంత్రి పదవిపై మీరు మాటిచ్చారు, ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించండి, అభివృద్ధి నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కాంగ్రెస్ పెద్దలకు సూచిస్తున్నారు. మంత్రి పదవి ఇస్తామన్న హామీ అమలు ఆలస్యమైంది సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారు , ఎందుకు కుదరటం లేదు సమీకరణలు?.. రాకుండా ఎవరడ్డుకుంటున్నారని నిలదీస్తున్నారు. పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములమని, పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములమని.. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా పార్టీ పెద్దలు వ్యవహరిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నిస్తున్నారు. ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతున్నానని, మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించని కాంగ్రెస్ పెద్దలు**

ఏదేమైనా ఇప్పటి వరకు అధిష్టాన పెద్దలు కానీ క్రమశిక్షణ కమిటీ కానీ రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎవరు స్పందించలేదు. పార్టీ పరంగా ఖండించడానికి కూడా ఎవరు ధైర్యం చేయని పరిస్థితి . అయితే ఇలాగే కొనసాగితే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, రాజగోపాల్‌రెడ్డి విషయంలో ఎదో ఒక నిర్ణయం తీసుకోవాలని హైకమాండ్ భావిస్తోందంట. ఇచ్చిన హామీని నెరవేర్చడమా లేక పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్న రాజగోపాల్‌కి షోకాజ్ నోటీసులు ఇవ్వడమా తేల్చే పనిలో ఉందంట. మరి చూడాలి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లెక్కలు ఎలా మారతాయో?

# మహిళలతోనే ఏదైనా సాధ్యం

విజయవాడ, అద్భుతాలన్నీ మహిళలతోనే సాధ్యమవుతాయని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. మహిళలకు సాధికారత కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడేదని కొనియాడారు. ఆవకాయ పెట్టాలన్నా.. అంతరిక్షంలోకి వెళ్లాలన్నా.. అది మహిళలతోనే సాధ్యమవుతుందని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని పేర్కొన్నారు. మహిళల పేరిట ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాలు అమలు చేసింది సీఎం చంద్రబాబేనని చెప్పారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిందీ సీఎం చంద్రబాబే అని వెల్లడించారు. మహిళలను అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చంద్రబాబు చర్యలు తీసుకున్నారని వివరించారు. మహిళలను కించ పరిచేలా సీరియళ్లు, చిత్రాలు రాకుండా చట్టాన్ని తీసుకురావాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. శుక్రవారం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్‌తోపాటు- మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. మహిళలకు ప్రత్యేక వర్సిటీ- ఏర్పాటు- చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతోందని గుర్తు చేశారు. కొంత మంది మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు లోకేష్. అసెంబ్లీ సాక్షిగా తన తల్లిని అవమానించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సొంత చెల్లితో రాఖీ కట్టించుకోని అన్న.. మహిళల గురించి మాట్లాడుతున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మండిపడ్డారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తోలు తీస్తామని హెచ్చరించారు మంత్రి లోకేష్. గతంలో మద్యపాన నిషేధం చేస్తానని ఓ రాక్షసుడు చెప్పాడన్నారు. కానీ.. జే బ్రాండ్స్ తీసుకొచ్చి ప్రజల ప్రాణాలు తీశారంటూ గత వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. తల్లి, చెల్లిని పట్టించుకోని వ్యక్తి.. ఇతర మహిళలకు న్యాయం చేస్తారా? అంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తల్లి మీద కేసు గెలిస్తే.. సంబరాలు చేసుకున్నారంటూ జగన్‌పై మంత్రి లోకేష్ నిప్పులు చెరిగారు. తల్లి, చెల్లికి న్యాయం చేశాకే తన గురించి మాట్లాడాలని వారిని కోరుతున్నానంటూ వైసీపీ అగ్రనాయకత్వానికి లోకేష్ కియర్ కట్‌గా స్పష్టం చేశారు. భూమి కంటే ఎక్కువ భారం మోసేది మహిళలేనన్నారు. మహిళల అభ్యున్నతికి పాటు- పడుతున్నది టీడీపేనేనని పేర్కొన్నారు. మహిళలకు ఆస్తిలో సగం వాటా అమలు చేసింది కూడా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆరే అని గుర్తు చేశారు.

# ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

కోల్‌కతా, స్వాతంత్య్ర దినోత్సవం రోజున విషాద ఘటన చోటు- చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానిక జాతీయ రహదారి 19లోని నాలా ఫెర్రీ ఘాట్ వద్ద ఈ ఘటన చోటు- చేసుకుంది. శుక్రవారం వేకువజాము బర్ధమాన్ నుంచి దుర్గాపూర్ వెళ్తున్న ప్రైవేట్ ప్యాసింజర్ బస్సు ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక వైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 10 మంది ప్రయాణికులు మృతి చెందగా.. 35 మందికి గాయాలయ్యాయి. ప్రయాణికులంతా బిహార్ వాసులని తెలిసింది. వీరంతా గంగా నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి తిరిగి వెళ్తున్నారు. ఈ ప్రమాద సమయంలో మొత్తం 45 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. చనిపోయిన వారిలో ఎనిమిది మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. అలాగే గాయపడ్డ వారిలో ఆరుగురు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలోనూ ఇవా(శుక్రవారం) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ట్రక్కును కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాగ్నాడి పోలీస్ స్టేషన్ పరిధి చిర్చారి గ్రామం సమీపంలో ఈ ఘటన చోటు- చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 25 నుంచి 34 ఏళ్ల మధ్య వయస్సు గల ఏడుగురు స్నేహితులు.. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి అంతర్రాష్ట్ర పర్యటనకు బయలుదేరారు. ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత.. ఛత్తీస్‌గఢ్ మీదుగా ఒడిశాలోని పూరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. డ్రైవర్ నిద్రలోకి జారుకోగానే వాహనం డివైడర్‌ను దూకి ఎదురుగా ఉన్న లేన్‌లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. దీంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌కు చికిత్స అందిస్తున్నారు.

# సూపర్ సిక్స్ ..సూపర్ హిట్

విజయవాడ,'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చింది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో 'స్త్రీశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. విజయవాడలో స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని సీఎం చంద్రబాబు జెండా ఊపి ప్రారంభించే ముందు మాట్లాడారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్రమే తమ లక్ష్యమన్నారు. ఆడబిడ్డల గౌరవం పెంచేందుకు ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఆడబిడ్డలకు మంచి చేశామనే తృప్తి కలుగుతోందన్నారు. రాష్ట్రమంతా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఈ పథకం ద్వారా 2.64 కోట్ల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత కాలం దూసుకెళ్తామన్నారు. ఈరోజు గర్వంగా చెబుతున్నా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ఐదేళ్ల పాటు- నవ్వడమే మరిచిపోయారు. ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింది. ఆడ బిడ్డలకు మహర్దశ వచ్చే వరకు అండగా ఉంటాం అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజు స్త్రీ శక్తి పథకానికి శ్రీకారం చుట్టాం. మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాం. మహిళా సాధికారిత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు- చేశాం. ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది మేమే. మహిళలు త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా కూడా రావాలని కోరుకుంటున్నామని అన్నారు. ఉచిత బస్సు వల్ల 2.62 కోట్ల మంది మహిళలకు లబ్ధి కలుగుతుంది. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛను ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' ఇస్తున్నాం. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. మనసుంటే మార్గం ఉంటుందని నిరూపించామని సీఎం చంద్రబాబు అన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, వ్యాపారం, ఆలయ దర్శనం.. ఇలా ఏ పనిమీద అయినా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చు. ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించే స్త్రీశక్తి పథకం ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. స్త్రీశక్తి పథకం.. పేద, దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటు-ంబాలకు ఆర్థికంగా మేలు చేయనుంది. నిత్యం ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం బస్సుల్లో రాకపోకలు జరిపే మహిళలకు ఇకపై ఛార్జీల భారం ఉండదు. ఇంటర్మీడియట్ నుంచి ఉన్నత విద్య వరకు

# ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్! తండ్రీకొడుకులు,అల్లుడిపై పొంగులేటి గురి?




హైదరాబాద్,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు ఆయన తనయుడు కేటీఆర్, మేనల్లుడు హరీశ్ రావు సొంత జిల్లాల్లోనే మొదట ధరణి అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఫోరెన్సిక్ ఆడిట్ కింద మొదట రేవంత్ సర్కార్ ఈ రెండు జిల్లాలనే ఎంపిక చేయడమంటే బీఆర్ఎస్ పార్టీని ఇరకాటంలో పెట్టేందుకేనన్న చర్చలు రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.ధరణి పోర్టల్ మాటున భారీ భూదందాలు జరిగాయని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించిన కాంగ్రెస్.. ఇప్పుడు తన ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ అక్రమాలను బయటపెట్టే పనిలో ఉన్నది. ధరణిలో అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తామని చెప్పిన విధంగానే ఆడిట్ నిర్వహించడానికి సిద్ధమైంది. పైలట్ ప్రాజెక్ట్ కింద రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టింది. అయితే.. ప్రభుత్వం ఎంచుకున్న జిల్లాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టను సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో చేపట్టింది. సిద్దిపేట జిల్లాలోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం ఉన్నది. బీఆరెస్ సర్కార్‌లో మంత్రిగా వ్యవహరించిన ఆయన అల్లుడు హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహించిన సిద్దిపేట.. జిల్లా కేంద్రంగా ఉన్నది. ఇక పార్టీలో నంబర్ టూగా చెలామణీ అవుతున్న బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.. జిల్లా కేంద్రంగా ఉన్నది. ముగ్గురు కీలక నేతలు తమ సామ్రాజ్యాలుగా వ్యవహరించుకునే జిల్లాలను ఎంపిక చేయడం ప్రభుత్వ వ్యూహాత్మక ఎత్తుగడగా సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు జిల్లాల్లో జరిగే ఆడిట్‌లో అక్రమాలు వెలుగులోకి వస్తే.. తదుపరి రంగారెడ్డితో పాటు గ్రేటర్ హైదరాబాద్ శివారు జిల్లాలైన సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, మెదక్ జిల్లాల్లో రెండవ దశలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్ననిర్ణయంతో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆ తరువాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆడిట్ నిర్వహించి, ధరణి అక్రమాలను వెలుగులోకి తేవాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించినట్లు తెలుస్తోంది.గత బీఆరెస్ సర్కారులో రెవెన్యూ శాఖ పూర్తిగా అవినీతి మయం అయిందని, రైతులను, భూయజమానులను దోచుకుంటున్నదని పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించిన విషయం తెలిసిందే. రెవెన్యూ వ్యవస్థ మొత్తాన్నీ అక్రమ అధికారుల కూపంగా అభివర్ణించింది. ఆ మేరకు బీఆరెస్ అధికార పత్రికగా చెలామణీ అయ్యే నమస్తే తెలంగాణలో సుమారు ఏడాదిపాటు 'ధర్మ గంట' శీర్షికన రెవెన్యూ అధికారుల అక్రమాలపై పెద్ద ఎత్తున కథనాలు వచ్చాయి. వాటి ఆధారంగా భూ అక్రమాలకు వీఆర్వోలను బాధ్యులను చేస్తూ నాటి ప్రభుత్వం ఏకంగా వీఆర్వో వ్యవస్థనే రద్దు చేసింది.అప్పటి వరకు ఉన్న రెవెన్యూ చట్టానికి సవరణలు చేస్తూ ధరణి పోర్టల్ తీసుకు వచ్చారు. ఈ చట్టం ద్వారా తాసిల్దార్లు, ఆర్డీవోలు, ఆఖరుకు జిల్లా కలెక్టర్లకు కూడా ఎలాంటి అధికారాలు లేకుండా కత్తెర వేశారు. ఆ తరువాత వర్కింగ్ ఆర్డర్స్‌లో కలెక్టర్లకు మాత్రమే పరిమిత అధికారులు ఇచ్చిన అప్పటి సీఎం కేసీఆర్.. మొత్తం ధరణి వ్యవస్థను తన గుప్పిట్లోకి పెట్టుకున్నారన్నవిమర్శలు తీవ్రంగా ఎదుర్కొన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాలేదు. లక్షల ఎకరాల భూములు పార్ట్ 'బీ'లో పెట్టారు. రైతులు తమ సమస్య పరిష్కారం కాకపోవడంతో కోర్టుకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌ను అడ్డం పెట్టుకొని ప్రభుత్వ పెద్దల అండదండలతో బడాబాబులు భారీ ఎత్తున భూ ఆక్రమణలకు పాల్పడ్డారన్న ఆరోపణలు బలంగా వెలువడ్డాయి. ధరణి పోర్టల్ సర్వర్‌కు సంబంధించిన లాగిన్స్‌తో కింద స్థాయి అధికారులకు ఎలాంటి సంబంధం లేకుండా అంతా ఉన్నతస్థాయి అధికారులతోనే మ్యుటేషన్లు, లావాదేవీలు, యాజమాన్య హక్కుల మార్పులను సెలవులు, కార్యాలయ వేళలతో నిమిత్తం లేకుండా చేపట్టి.. భూములను కొట్టేశారన్న ఆరోపణలు కూడా పెద్ద ఎత్తున వచ్చాయి.ధరణిలో భారీ ఎత్తున భూ కుంభకోణం జరిగిందని ఆరోపించిన కాంగ్రెస్ పార్టీ, అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.. తాము అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని, దానిస్థానంలో పారదర్శకమైన భూ పరిపాలనా వ్యవస్థ తీసుకువస్తామని ప్రకటించారు. ధరణిలో అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదలి పెట్టబోమని, కఠినంగా శిక్షిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాన్ని నమ్మిన రైతులు అధికారం కట్టబెట్టారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. చెప్పిన విధంగానే ఫోరెన్సిక్ ఆడిట్ జరిపేందుకు చర్యలు చేపట్టారు.ప్రభుత్వం కేరళకు చెందిన కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అష్యూరెన్స్ సెంటర్‌ను ఈ బాధ్యతల్లో నియమించింది. నెల రోజులుగా కొనసాగుతున్న ఈ ఫోరెన్సిక్ ఆడిట్ త్వరలోనే పూర్తి కానున్నట్లు సమాచారం. ధరణి పోర్టల్‌లో జరిగిన అనుమానాస్పద లావాదేవీల డిజిటల్ ఫుట్ ప్రింట్స్‌ను పరిగణలోకి తీసుకుని, భూ రికార్డుల మార్పిడి, మ్యుటేషన్లు, యాజమాన్య హక్కుల బదిలీ, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో జరిగిన అనుమానాస్పద లావాదేవీలను గుర్తించనున్నది. ఈ లావాదేవీలు ఏ సమయంలో? ఎక్కడి నుంచి జరిగాయి? ఏ అధికారి ద్వారా జరిగాయి? అనే వివరాలను కూడా గుర్తిస్తున్నట్లు తెలిసింది.

# ధర్మస్థల తవ్వకాలపై శివకుమార్ సంచలన వ్యాఖ్యలు



బెంగళూర్ :దేశవ్యాప్తంగా తీవ్రచర్చనీయాంశంగా మారిన సామూహిక ఖననం కేసుపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విపక్షాల తీవ్ర విమర్శల నేపథ్యంలో ఆయన స్పందించారు. ధర్మస్థళ పుణ్యక్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కుట్ర జరుగుతోందని, త్వరలోనే నిజం నిలకడ మీద తెలుస్తుందని అన్నారాయన.ధర్మస్థళలో రెండు దశాబ్దాల కిందట.. హత్యలు, అత్యాచారాలు జరిగాయని, వందల సంఖ్యలో మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశారని ఓ వ్యక్తి ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ క్షేత్రంలో మాజీ పారిశుద్ధ్య కార్మికుడిగా చెబుతున్న ఆ 61 ఏళ్ల వ్యక్తి ఆరోపణల నేపథ్యంలో.. ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయించి అతను చూపించిన చోటల్లా తవ్వకాలు జరిపిస్తోంది. అయితే.. ఈ వ్యవహారంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్ర విమర్శలు, ఆరోపణలకు దిగడంతో.. డిప్యూటీ సీఎం శివకుమార్ స్పందించారు. సిట్ దర్యాప్తుపై తనకు నమ్మకం ఉందని, త్వరలోనే ధర్మస్థళపై జరుగుతున్న కుట్ర బయటకు వస్తుందని, ఆ ఆరోపణలు రుజువుకాని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా తనతో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని శివకుమార్ వెల్లడించారు. అయితే.. "నేను ఇప్పటికీ ధర్మస్థళ మంజునాథస్వామి భక్తుడినే. ధర్మస్థల వీరేంద్రహెగ్డే చేసిన సేవలను గౌరవిస్తాం. భక్తునికి దేవునికి ఉన్న సంబంధానికి మనం భంగం కలిగించరాదు. అలాగని నేనేం ధర్మస్థళకు అనుకూలంగానో, వ్యతిరేకంగానో మాట్లాడడం లేదు. చట్టానికి ఎవరూ అతీతులు కారని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే విషయాన్ని గుర్తు చేస్తున్నా. ఒకవేళ ధర్మస్థళపై నిజంగా కుట్ర జరిగి ఉంటే విచారణలో బయటపడుతుంది. తప్పు ఎవరు చేసినా శిక్ష అనుభవించకతప్పదు. ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో.. ఈ అంశంపై హోం మంత్రి పరమేశ్వర సోమవారం కర్ణాటక అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేస్తారు" అని శివకుమార్ వెల్లడించారు. గురువారం ధర్మస్థళ తవ్వకాలపై అసెంబ్లీలో హోంమంత్రి పరమేశ్వర్ మాట్లాడారు. "ఫిర్యాదు ప్రకారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు, ఆ ప్రాంత ప్రజల డిమాండ్ మేరకు జూన్ 19 సిట్ ను ఏర్పాటుచేసి విచారణకు ఆదేశించాం. ఇది పూర్తి కావడానికి కాలపరిమితి ఉంటుంది. ఈలోపు సిట్ దర్యాప్తునకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని భావిస్తున్నాం" అని అన్నారాయన. 1995-2014 మధ్య తాను పని చేస్తున్న సమయంలో ధర్మస్థళ ఆలయ నిర్వాహకుల ఆదేశాల మేరకు తానే స్వయంగా ఆ మృతదేహాలను పాతిపెట్టినట్లు సదరు వ్యక్తి చెబుతున్నాడు. అందులో మహిళలు, మైనర్ బాలికల మృతదేహాలు అధికంగా ఉన్నాయని, కొందరిపై లైంగిక దాడి జరిగినట్లు ఆనవాళు కూడా ఉన్నాయని మెజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం కూడా ఇచ్చాడు. ముసుగు ధరించిన ఆ వేగును.. 'భీమా'.. 'చిన్నయ్య'.. అని కర్ణాటక మీడియా వ్యవహరిస్తోంది. విక్టిమ్ ప్రొటెక్షన్ కింద సిట్ అతనికి రక్షణ కల్పిస్తోంది కూడా. ఇప్పటిదాకా నేత్రావతి నదీ తీరం వెంబడి అతను చూపించిన చోట్లలో సిట్ తవ్వకాలు జరిపింది. అందులో రెండు చోట్ల మాత్రమే అస్తిపంజరాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించాడు ఆ వ్యక్తి. ఇదిలా ఉంటే.. తీవ్ర చర్చకు దారితీసిన ధర్మస్థలలో మృతదేహాల కోసం తవ్వకాల కేసులో గురువారం విధానసభ దద్దరిల్లింది. ధర్మస్థల మీద అసత్య ప్రచారం చేస్తున్న ప్రభుత్వం కూకటి వేళ్లతో కూలిపోతుందని బీజేపీ, జేడీఎస్ నాయకులు శాపాలు పెట్టారు. బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. "ఇటీవల గుర్తుతెలియని వ్యక్తి 10, 15 ఏళ్ల క్రితం ధర్మస్థల లో వందలాది మృతదేహాలను పూడ్చిపెట్టానని చెప్పడం ద్వారా పవిత్ర ధర్మక్షేత్రానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా కుట్ర జరుగుతోంది. అస్థికల కోసం తవ్వకాలంటూ హిందూ ధార్మిక కేంద్రాలపై జరుగుతున్న అసత్య ప్రచారం సహించడం సాధ్యం కాదు. ప్రభుత్వం ఈ విషయంలో జాగ్రత్త వహించాలి. ప్రజలు ఆవేశం చెంది పోరాటం చేసే స్థితి తీసుకురాకూడదు.. .. ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇది దర్యాప్తా, హిందూ పుణ్యక్షేత్రంపై జరుగుతున్న కుట్రలో అసత్య ప్రచారంలో కాంగ్రెస్ యూట్యూబర్లు, ఇతర మతస్తుల చేతిలో కీలుబొమ్మగా మారుతోందా?" అని ధ్వజమెత్తారు. ఈ క్రమంలో సిట్ దర్యాప్తు చేయడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని.. అలాగని ధర్మస్థళను టార్గెట్ చేయడం సరికాదన్నారు. గుర్తుతెలియని వ్యక్తి మాటలు విని గుంతలు తవ్వే పనిచేస్తున్నారని, ధర్మస్థల పవిత్రతను కాపాడటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్ని రోజులు ఎన్ని గుంతలు తవ్వారు, ఎన్ని అస్థిపంజరాలు దొరికాయి అనేది చెప్పాలని సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం కనిపిస్తోంది.

# వివాదంలో 'గవర్నర్ కోటా'



హైదరాబాద్,రాష్ట్రాల్లో అసెంబ్లీలుండగా శాసన మండళ్ళు అవసరమా అన్న వాదనతోపాటే ఆ శాసన మండళ్ళకు కొందరు సభ్యుల్ని నామినేట్ చేయటానికి గవర్నర్‌లకుండే అధికారాలపై, ఆ కోటాలో ఎంపికైన అభ్యర్థుల అర్హతలపై కూడా విస్తృతంగా చర్చ జరుగుతుంటుంది. తెలంగాణ శాసన మండలికి నిరుడు గవర్నర్ కోటాలో ఎంపికైన విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరామ్, పాత్రికేయుడు అమేర్ అలీఖాన్‌ల సభ్యత్వాలు రద్దుచేస్తూ బుధవారం సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలీయటంతో ఆ అంశాలపై మళ్లీ చర్చ మొదలైంది. రాష్ట్రాల్లో శాసన మండళ్ళ మాదిరే కేంద్ర స్థాయిలో ఉండే రాజ్యసభకు చేసే ఎంపికలు కూడా అందరిలో ఆసక్తి రేపుతాయి. అంతేకాదు... వివాదాలకూ, అభ్యంతరాలకూ దారితీస్తుంటాయి. పాలకులుగా ఎవరున్నా ఈ రివాజు మారదు. ఇప్పుడు ఎమ్మెల్సీ సభ్యత్వాలు రద్దయిన ప్రొఫెసర్ కోదండరామ్, అమేర్ అలీఖాన్‌ల నేపథ్యం చూస్తే గవర్నర్ కోటాలో ఎంపికకు వారికి అన్ని విధాలా అర్హతలున్నాయని అర్థమవుతుంది. తెలంగాణ సాధనలో జేఏసీ కన్వీనర్‌గా ప్రొఫెసర్ కోదండరామ్ పాత్ర తెలియనివారు లేరు. ఉర్దూ పత్రిక 'సియాసత్'లో సీనియర్ పాత్రికేయుడైన అమేర్ అలీఖాన్ విద్యా, సంక్షేమ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటారు. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే స్థానాలకు దాసోజు శ్రవణ్ కుమార్, కుర్ర సత్యనారాయణలను ఎంపిక చేసింది. వీరిద్దరికీ కూడా సామాజిక ఉద్యమాల్లో, సేవాకార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ పాలిస్తున్నప్పుడు గవర్నర్ కోటా ఎంపికలపై రాష్ట్ర మంత్రివర్గ సిఫార్సులకు గవర్నర్ నుంచి దాదాపు అభ్యంతరాలు వినబడవు. వేర్వేరు ప్రభుత్వాలున్నప్పుడే సమస్యంతా! విపక్షాలు ఎటూ అన్ని వేళలా విమర్శిస్తాయి. అయితే గవర్నర్ కోటాకు వీలు కల్పించే రాజ్యాంగంలోని 171(5) అధికరణం స్ఫూర్తిని చాలా సందర్భాల్లో ప్రభుత్వాలు బేఖాతరు చేస్తున్నాయనీ, 'రాజకీయ నిరుద్యోగుల' పునరావాసానికి దాన్ని వినియోగిస్తున్నారనీ ఆరోపణలున్నాయి. ఆ అధికరణం ప్రకారం సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, కళ, సహకారోద్యమం, సామాజిక సేవ తదితర రంగాల్లో పాటుబడినవారిని, ఆ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం, వ్యావహారిక అనుభవం ఉన్నవారిని గవర్నర్ కోటాలో నామినేట్ చేయొచ్చు. మేధావులూ, కళాకారులూ, సేవాతత్పరత కలిగినవారూ నేరుగా పోటీచేసి నెగ్గే అవకాశం తక్కువ కాబట్టి శాసనాల రూపకల్పనలో, పాలనలో అటువంటివారి సేవలు పొందాలన్న ఉద్దేశంతో ఈ కోటా ఏర్పాటు చేశారు. ఇలాంటివారితో ఏర్పడే సభ కనుకే పెద్దల సభ అనీ, ఎగువసభ అనీ శాసన మండళ్ళకూ, రాజ్యసభకూ పేరుంది. రాజ్యాంగంలోని 80వ అధికరణం రాజ్యసభకు రాష్ట్రపతి కోటా కింద ఎంపిక చేసే వీలు కల్పిస్తోంది. అయితే దేశ చరిత్రలో కేబినెట్ సిఫార్సు లేకుండా గవర్నర్ తనంత తానే నామినేట్ చేసిన ఏకైక ఉదంతం ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో చోటు చేసుకుంది. 1952లో సీనియర్ నాయకుడు చక్రవర్తి రాజగోపాలాచారిని నాటి గవర్నర్ శ్రీ ప్రకాశ ఎమ్మెల్సీగా నామినేట్ చేశారు. అప్పటి ఎన్నికల్లో కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోని కూటమి అధిక స్థానాలు గెల్చుకోవటం, కాంగ్రెస్ మైనారిటీలో పడటంతో నాటి ప్రధాని నెహ్రూ మంత్రాంగం నడిపి అనారోగ్యంతో ఉన్న రాజగోపాలాచారిని సీఎంగా రప్పించారు. అటుపై ఉప ఎన్నిక ద్వారా ఎమ్మెల్యే కావాలని ఆదేశించినా రాజగోపాలాచారి తిరస్కరించటంతో నెహ్రూ ఆగ్రహం వ్యక్తం చేశారంటారు. బల నిరూపణ సమయానికి రాజగోపాలాచారి ఫిరాయింపుల్ని ప్రోత్సహించి పదవి నిలబెట్టుకున్నారు. శ్రీ ప్రకాశ తీరును మాత్రం ఇప్పటికీ 'రాజ్యాంగ అనౌచిత్యం'గా రాజ్యాంగ నిపుణులు అభివర్ణిస్తారు. దేశవ్యాప్తంగా చాలాచోట్ల ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులైన మేధావులూ, కళాకారులూ, సాహితీవేత్తలూ లేకపోలేదు. అయితే ఆ యా రంగాల్లో ఎన్నదగిన వైశిష్ట్యం ఉన్నా, రాజకీయ అనుకూలతలు తోడైనప్పుడే వారికి పదవులు దక్కుతున్నాయి. పదవులిస్తామన్నా వద్దని తిరస్కరించినవారూ లేకపోలేదు. కర్ణాటక సీఎంగా దేవరాజ్ అర్స్ ఉన్నప్పుడు సీనియర్ పాత్రికేయుడు టీఎస్ రామచంద్రరా

# కారు రోడ్డుపైకి వస్తుందా? గంటల వ్యవధిలో కేసీఆర్‌తో కొడుకు-కూతురు భేటీ వెనుక




హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీలో ఏం జరుగుతోంది? షెడ్డు నుంచి కారు రోడ్డుపైకి వస్తుందా? ఫామ్‌హౌస్ నుంచి పార్టీ వ్యవహారాలను కేసీఆర్ పర్యవేక్షణ చేస్తున్నారా? ఉన్నట్లుండి శుక్రవారం కేసీఆర్‌తో కవిత సమావేశం వెనుక ఏం జరిగింది? ఆ తర్వాత కేటీఆర్ భేటీ వెనుక మతలబు ఏంటి? ఇవే ప్రశ్నలు చాలామంది వెంటాడుతున్నాయి.తెలంగాణలో రేపో మాపో జూబ్లీహిల్స్ సీటుకు ఉప ఎన్నిక జరగనుంది. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో కారు పార్టీలో అంతర్గత వ్యవహారాలపై చర్చకు కారణమైన కవిత తన తండ్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఫామ్ హౌస్‌కు వెళ్లారు. అదే సమయంలో పార్టీ ముఖ్య నేతలకు కేసీఆర్ నుంచి పిలుపు రావటంతో ఏదో జరుగుతోందన్న చర్చ అప్పుడే మొదలైంది.శుక్రవారం మధ్యాహ్నం కేసీఆర్‌తో కవిత భేటీ అయ్యారు. కొడుకుని కాలేజీలో చేర్చేందుకు అమెరికా వెళ్తున్నారు ఆమె. రెండువారాల పాటు అక్కడే ఉండనున్నారు. విదేశాలకు వెళ్ళేముందు తండ్రి కేసీఆర్ ఆశీర్వాదం తీసుకునేందుకు కొడుకుతో కలిసి ఫామ్ హౌస్‌కు వెళ్లారు. కవిత కుమారుడు ఆర్యను గ్రాడ్యుయేషన్‌లో చేరనున్నాడు. ఈ నేపథ్యంలో ఫామ్ హౌస్‌కు కవిత వెళ్లారు. శనివారం వేకువజామున శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి అమెరికాకు వెళ్లనున్నారు కవిత. సెప్టెంబర్ ఒకటిన తిరిగి కవిత హైదరాబాద్‌కు రానున్నారు. ఈ వ్యవహారం జరుగుతుండగా కేటీఆర్, హరీష్ సహ పార్టీ కీలక నేతలు ఫామ్ హౌస్‌కు రావాలని కేసీఆర్ నుంచి వర్తమానం వెళ్లింది.ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే నేతలు అక్కడికి వెళ్లారు. ఈ భేటీలో పలు అంశాలపై కేసీఆర్ చర్చించే అవకాశం ఉంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వాటిపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీసమావేశాల్లో కాళేశ్వరం రిపోర్ట్‌పై చర్చించనున్నారు.కాళేశ్వరం రిపోర్టుపై ఏ విధంగా అడుగులు వేయాలి? అదేదాని పై నేతలతో మంతనాలు జరపనున్నారట. కొద్దిరోజులుగా పార్టీపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టేలా అధినేత ప్రణాళికలు సిద్ధం చేశారని తెలుస్తుంది. ఇదే క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ సభ ఏర్పాటు చేయాలన్నది పార్టీ పెద్దల మాట.దీనిపై ఓ నిర్ణయం రావచ్చని అంటున్నారు.మరి నేతల భేటీలో ఇవేకాకుండా ఇంకా ఏమైనా అంశాలు చర్చకు వస్తాయా? లేవా చూడాలి.

# ఆర్ఎస్ఎస్ ఈజ్ గ్రేట్ అన్న మోడీ



న్యూఢిల్లీ,దేశానికి 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎర్ర కోట నుంచి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక విషయాలను ప్రస్తావించారు. తన రికార్డును తానే బద్ధలు కొడుతూ వంద నిముషాలకు పైగా ఆయన సుదీర్ఘమైన స్పీచ్ నే ఇచ్చారు. ఈ స్పీచ్ లో అనేక విషయాలను ప్రస్తావించారు. జాతీయ అంతర్జాతీయ సమస్యలను కూడా జనం ముందు ఉంచారు. అంతే కాదు ఒక వైపు పాక్ సవాళ్ళకు ధీటైన జవాబు ఇస్తూ మరో వైపు అమెరికా దూకుడుకు ధీటైన బదులు ఇచ్చారు.

**ఆర్ఎస్ఎస్ కి కితాబు :**

దేశం కోసం ఒక ప్రభుత్వేతర సంస్థ వందేళ్ళ పాటు పనిచేయడం అన్నది గొప్ప విషయంగా నరేంద్ర మోడీ చెప్పారు. 1925లో ఆర్ఎస్ఎస్ పుట్టింది అని గుర్తు చేశారు. గత వంద సంవత్సరాలుగా దేశానికి సేవ చేస్తున్న ఆర్ఎస్ఎస్ స్వచ్ఛంద సేవకుల అంకితభావానికి ప్రధానమంత్రి మోడీ అభివందనం చేశారు. వ్యక్తి నిర్మాణ్ సే రాష్ట్ర నిర్మాణ్ అనే సంకల్పంతో స్వయంసేవకులు దేశ సంక్షేమానికి తమ జీవితాలను అంకితం చేశారని మోడీ కొనియాడారు. ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్జీఓ అని మోడీ చెప్పుకొచ్చారు. ఆర్ఎస్ఎస్ కి వంద సంవత్సరాల అంకితభావ చరిత్ర ఉందని సరైన వేదిక మీద జాతికి సరైన సందేశం ఆ సంస్థ గురించి మోడీ పంపించారు.

**గ్యాప్ ఉందన్న ప్రచారంతో :**

ఆర్ఎస్ఎస్ తో బీజేపీకి భారీ గ్యాప్ ఉందని ప్రచారం ఇటీవల కాలంలో జరుగుతోంది. అంతే కాదు ఏడున్నర పదుల వయసు పూర్తి చేసుకున్న వారు రాజకీయాల నుంచి తప్పుకోవాలని కూడా ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ ఈ మధ్య సూచించారు. దాంతో అవన్నీ మోడీ గురించే అని కూడా అనుకున్నారు. ఇలా ఆర్ఎస్ఎస్ విషయంలో ఏదో దూరం అయితే ఉందని అంతా అనుకుంటున్న వేళ నరేంద్ర మోడీ ఆర్ఎస్ఎస్ ని ఆకాశానికి ఎత్తేశారు. అంతే కాదు ప్రపంచంలో సరిసాటి మరోటి లేదని కూడా బల్ల గుద్ది చెప్పారు.

**జన్ సంఘ్ వ్యవస్థాపకుడిని తలుస్తూ :**

అంతే కాదు జనసంఘ్ వ్యవస్థాపకుడిగా ఉంటూ తొలి ఎంపీ అయి కేంద్రంలో ఆ పార్టీ తరపున తొలి మంత్రిగా కొన్నాళ్ళ పాటు పనిచేసిన శ్యామా ప్రసాద్ ముఖరీ గురించి కూడా మోడీ గొప్పగా చెప్పారు. ఆయన దేశం కోసం బలిదానం చేశారని అన్నారు. ఆయన సేవలను ప్రజలు ఎప్పటికీ మరచిపోరని చెప్పారు. దేశం బాగుండాలని ఆశించిన తొలి తరం నాయకులలో శ్యామా ప్రసాద్ ముఖరీ కీలక వ్యక్తిగా కూడా మోడీ పేర్కొన్నారు. మొత్తం మీద మోడీ ప్రసంగంలో సంఘ్ గురించి బీజేపీ పూర్వ రూపం అయిన జన సంఘ్ అధినేత గురించి సంస్మరించుకోవడం విశేష పరిణామం అని అంటున్నారు.

## పార్టీ మార్పు ఊహాగానాలు మాత్రమే

వికారాబాద్, పార్టీ మార్పుపై మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి క్లారిటీ- ఇచ్చారు. తాను పార్టీ మారుతానని వస్తున్న పుకార్లను నమ్మొద్దంటూ తాండూరు మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న వార్తలను ఖండించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు తనపై బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారన్నారు. గువ్వల బాలరాజును తానే పంపించానని మరికొందరి ఎమ్మెల్యేలను బీజేపీలోకి తీసుకెళ్తానన్నది అవాస్తవమన్నారు. బీజేపీ తనపై ఎన్ని కుట్రలు చేసిన వారికి లొంగలేదని స్పష్టం చేశారు. సొంత లాభంకన్న తాండురు అభివృద్ధి ముఖ్యమన్నారు. బీఆర్ఎస్‌లో సైనికుడిలా పనిచేస్తానని చెప్పారు.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవెర్చాలని డిమాండ్ చేశారు. త్వరలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులతో స్థానిక సంస్థల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు- తెలిపారు.

# మర్వాడీ గో బ్యాక్" అంశంపై స్పందించిన బండి సంజయ్..



హైదరాబాద్, మర్వాడీ గో బ్యాక్ పేరుతో కమ్యూనిస్టుల ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల నాయకులు డ్రామాలాడుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు.మర్వాడీలు వ్యాపారం చేసుకుంటే తప్పేముందని ప్రశ్నించారు. "మర్వాడీలు ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదు. తెలంగాణను దోచుకోలేదు. వ్యాపారాలు చేసుకుంటూ సంపదను సృష్టించారు. జీడీపీని పెంపులో వారి పాత్ర చాలా ఉంది. హిందూ సనాతన ధర్మం కోసం పాటుపడుతున్నారు. అట్లాంటి మర్వాడీలు తెలంగాణ నుంచి ఎందుకు వెళ్లిపోవాలి?" అని ప్రశ్నించారు. మర్వాడీ గో బ్యాక్ పేరుతో హిందూ సమాజాన్ని చీల్చే కుట్రలు మొదలయ్యాయని అన్నారు. హిందూ కుల వృత్తులను దెబ్బతీసేలా మటన్ షాపులు, డ్రై క్లీనింగ్ షాపులను ఒక వర్గం వారే నిర్వహిస్తున్నారని మండిపడ్డారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మర్వాడీ గో బ్యాక్ ఉద్యమాలు చేస్తే బీజేపీ పక్షాన ఒక వర్గం నిర్వహించే మటన్ షాపులు, డ్రై క్లీనింగ్ షాపులకు వ్యతిరేకంగా హిందూ కుల వృత్తులను కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.దీంతోపాటు రోహింగ్యాల గో బ్యాక్ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని బండి సంజయ్ చెప్పారు. ఈరోజు సాయంత్రం హైదరాబాద్ లోని యూసుఫ్ గూడలో బీజేపీ సెంట్రల్ జిల్లా శాఖ అధ్యక్షులు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా ర్యాలీ' కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "మటన్ ఎవరు కొట్టాలి? హిందువులైన కటికోళ్లు మటన్ కొట్టాలి. హిందూ రజకులు బట్టలుతుకుతారు. కానీ ఇక్కడ ఏం జరుగుతోంది.నయీం మటన్ షాపు,సలీం డ్రై క్లీన్ షాపులు పెడుతుంటే ఎందుకు స్పందించడం లేదు. హిందూ సమాజాన్ని చీల్చే కుట్ర జరుగుతోంది.రోహింగ్యాలు గో బ్యాక్.. హిందువుల కుల వృత్తులను కాపాడాలని మేం ఉద్యమం చేస్తాం." అని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com